సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 15 । డిసెంబర్ । 2023



కొత్త సొబగులు

ఆదిబట్ల ఐటీహబ్ రోడ్డుకు మోక్షం లభించింది. ఔటర్ నుంచి పునరుద్ధరణ పనులు ప్రారంభమయ్యాయి. 10లో▸



ప్రసిద్ధి చెందుతుంది

మరకత శివాలయాన్ని కృష్ణ శిలతో పునః నిర్మిస్తున్నట్లు టీటీడీ మాజీ బోర్డు సభ్యుడు శివకుమార్ సుందర్‌రాజన్ చెప్పారు. 10లో▸



ఫెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

మొయినాబాద్ మండలం తోలుకట్టలోని చేవెళ్ల గురుకుల పాఠశాల విద్యార్థులు ఇగ్నైట్ ఫెస్ట్‌లో ప్రతిభ కనబర్చారు. 10లో▸

న్యూస్‌రీల్

పిల్లలందరికీ టీకాలు ఇప్పించాలి

తుర్కయంజాల్: పిల్లలందరికీ తప్పనిసరిగా టీకాలు ఇప్పించాలని జిల్లా వైద్యాధికారి డా. వెంకటేశ్వర్ రావు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించేలా చైతన్య పరచాలని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డా.ఎం.ఎ.అజహర్ మాట్లాడుతూ.. వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది టీకాల కార్యక్రమంలో పాటించాల్సిన సాంకేతిక విధానాలు, ఆధునిక పద్ధతులు, పిల్లల్లో వ్యాధులను గుర్తించే పరిజ్ఞానాన్ని వివరించారు. చిన్న పిల్లల్లో వచ్చే ఆకస్మిక జ్వరం, అస్వస్థత, శరీర భాగాల్లో కదలికలు లేకపోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే వైద్య సహాయం అందేలా చర్యలు చేపట్టాలని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో జిల్లా టీకాల అధికారి డా.స్వర్ణ కుమారి, అన్ని డివిజన్ల డిప్యూటీ డీఎంహెచ్ఓలు, పీహెచ్‌సీ వైద్యాధికారులు పాల్గొన్నారు.

నాలాలు, వాగుల కబ్జాలను సహించం

ఇరిగేషన్ శాఖ డీఈ పరమేశ్వర్



తీగల వాగును పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ పరమేశ్వర్

శంకర్‌పల్లి: నాలాలు, వాగులను కబ్జా చేస్తే చర్యలు తప్పవని ఇరిగేషన్ శాఖ డీఈ పరమేశ్వర్ పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని ఫత్తేపురం తీగల వాగును గురువారం ఆయన పరిశీలించారు. వాగును కబ్జాచేసి ఓ వెంచర్ యాజమాన్యం ప్రహరీ నిర్మాణం చేపడుతోందని స్థానిక కౌన్సిలర్ రాములు చేసిన ఫిర్యాదు మేరకు స్పందించారు. వాగులో ప్రహరీ నిర్మాణ పనులను నిలిపివేయించారు. సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎవరైనా కబ్జా చేసే ప్రయత్నం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో కూల్చివేసిన ప్రహరీకి మళ్లీ ఏ విధంగా నిర్మాణం చేస్తారని వెంచర్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శంకర్‌పల్లి కమిషనర్ జ్ఞానేశ్వర్‌కు లేఖ రాస్తామని, అక్రమంగా చేపట్టిన ప్రహరీని కూల్చివేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట కౌన్సిలర్ రాములు ఉన్నారు.

ఈకేవైసీ నమోదుతో పారదర్శక సేవలు



కందుకూరులో గ్యాస్ సిలిండర్ల సరఫరాను పరిశీలిస్తున్న రఘునందన్

కందుకూరు: ఈకేవైసీ నమోదుతో పారదర్శకతతో పాటు సేవల్లో నాణ్యత పెరుగుతుందని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ ఎం.రఘునందన్ అన్నారు. గ్యాస్ సిలిండర్ల సరఫరాను గురువారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. గ్యాస్ వినియోగదారుల్లో ఈకేవైసీ నమోదుపై అయోమయం నెలకొందన్నారు. ఉజ్వల గ్యాస్ కనెక్షన్ ఉన్నవాళ్లు ఈ నెలాఖరు లోపు ఈకేవైసీ పూర్తి చేసుకోవచ్చన్నారు. సాధారణ గ్యాస్ వినియోగదారులు మార్చి 2024 వరకు ఈకేవైసీ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈకేవైసీ నమోదుతో డీలర్ల సేవలు మరింత మెరుగయ్యే అవకాశం ఉందన్నారు. అవకతవకలు, అక్రమాలకు చెక్ పెట్టొచ్చన్నారు.

ఇటు చెరువు అటు కుంట..



ఇది ఐటీకారిడార్‌లోని గౌలిదొడ్డిలో ఉన్న ఈద్గవానికుంట. సర్వే నంబర్ 71లో 5.30 ఎకరాల్లో విస్తరించి ఉంది. గతంలో ఇరిగేషన్ శాఖతో పాటు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో సీఎస్‌ఆర్ నిధులతో కుంటకు రీస్టోరేషన్, సుందరీకరణ పనులు చేపట్టారు. కుంటకు మరోవైపు (గోపన్‌పల్లి) ఆనుకుని సర్వే నంబర్లు 71/1, 72/2లలో శిఖం పట్టా భూములు ఉన్నాయి. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న పట్టా భూములతో పాటు కుంటను కూడా పూర్తిగా పూడ్చివేశారు. రూ.1.84 కోట్ల వ్యయంతో పూడ్చివేతను తొలగించేందుకు హుస్సేన్‌సాగర్ లేక్ డివిజన్ ఈఈ పట్టాదారులకు నోటీసులు జారీ చేశారు. కానీ ఇప్పటికీ వ్యర్థాల తొలగింపు మొదలు కాలేదు.



ఇది హత్తిగూడ చెరువు. దీనికి ఒకవైపు హయత్‌నగర్, మరోవైపు అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలు విస్తరించి ఉన్నాయి. రెండు మండలాల సరిహద్దు గ్రామమైన హత్తిగూడ 19 సర్వే నంబర్‌లో 8.23 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీనిలో రెండెకరాలు డబుల్ బెడ్రూం ఇళ్లకు కేటాయించగా, మిగిలిన 6.23 ఎకరాల విస్తీర్ణంలో కుంట ఉంది. చెరువుకు ఆనుకుని హయత్‌నగర్ మండలం సర్వే నంబర్ 98, 99 పట్టా భూములు ఉన్నాయి. ఎఫ్‌టీఎల్ భూముల్లో ఇప్పటికే వెంచర్ చేశారు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారు దానిలో మట్టిని నింపి.. చెరువు ఆనవాళ్లు లేకుండా చేశారు. చెరువులోకి నీరు చేరకుండా కల్వర్టును మూసివేయడంతో ఆ పక్కనే ఉన్న కాలనీలు తరచూ నీట మునుగుతున్నాయి. ఇరిగేషన్, జీహెచ్‌ఎంసీ అధికారులు గతంలోనే సర్వే చేసి, చెరువుకు హద్దులు నిర్ణయించినప్పటికీ ఆ తర్వాత వచ్చిన అధికారులు దాన్ని పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ఆ చెరువు పూర్తిగా కనుమరుగైంది.

కాదేదీ కబ్జాకనర్హం

- 'హద్దు' మీరి.. వ్యర్థాలు నింపి
- ఆనవాళ్లు మాయం
- నోటీసులతో సరి
- పట్టించుకునేవారేరి?

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలో చిన్నా, పెద్ద అన్నీ కలిపి 2,132 చెరువులు, కుంటలు ఉండగా, వీటి పరిధిలో 70,067 ఎకరాల ఆయకట్టు ఉంది. మెజార్టీ చెరువులు, కుంటలు నగరానికి ఆనుకుని ఔటర్ రింగ్‌రోడ్డుకు అటు ఇటుగా విస్తరించి ఉన్నాయి. అంతర్జాతీయ విమానాశ్రయానికి తోడు ఐటీ పెట్టుబడులు వెల్లువెత్తుతుండటంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఫలితంగా కబ్జాదారుల కళ్లు చెరువులు, కుంటలపై పడ్డాయి. ఎఫ్‌టీఎల్, శిఖం పట్టా భూములను కొనుగోలు చేసి, వాటికి ఆనుకుని ప్రభుత్వ భూముల్లో విస్తరించి ఉన్న చెరువులు, కుంటలను కబ్జా పెట్టారు. ఫలితంగా ఒకప్పుడు నిత్యం నీటితో కలకళలాడిన ఆయా జలవనరులు ప్రస్తుతం కబ్జాదారుల చెరల్లో చిక్కి వట్టిపోయాయి. బహుళ అంతస్తుల భవనాలకు నెలవయ్యాయి. నిర్మాణ వ్యర్థాలు, భారీ బండరాళ్లను తెచ్చి వాటిని పూడ్చి వేయడంతో చిన్నపాటి వర్షాలకే వరదలు సమీప కాలనీలను ముంచెత్తుతున్నాయి. చెరువుల పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసినా వాటిని కాపాడలేక పోతున్నాయి.

ఫార్మా రద్దు సరికాదు

- రైతులకు న్యాయం చేయకపోతే ఉద్యమిస్తాం
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం: ఫార్మాసిటీని రద్దు చేస్తే ఆ భూములను తిరిగి రైతులకు ఇచ్చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఫార్మా కోసం భూములను పరిశీలించి ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసిందని గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఫార్మాకు అనుమతి ఇవ్వడంతోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం భూసేకరణ చేపట్టి రైతులకు సుమారు రూ.600 కోట్లకు పైగా నష్టపరిహారం చెల్లించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫార్మాను రద్దు చేసి ఆభూముల్లో హౌసింగ్‌బోర్డు, టౌన్‌షిప్, మెట్రో సిటీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రియల్ వ్యాపారం చేసుకునేందుకు ఫార్మాను రద్దు చేస్తే సహించేదిలేదన్నారు. రైతులకు భూములు వాపసు చేయకుంటే.. వారికి న్యాయం జరిగేంత వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. పాత ప్రభుత్వం ఇచ్చిన అభివృద్ధి పనుల ప్రొసీడింగ్స్‌ను రద్దు చేస్తామనడం సరికాదన్నారు. ఇది కక్ష సాధింపు చర్య అవుతుందన్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను నియోజకవర్గంలో చేపట్టాలని డిమాండ్ చేశారు.



యాచారంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఫార్మాసిటీ భూ బాధితులు

ఫార్మాసిటీ రద్దుపై హర్షం

- సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం
- యాచారంలో భారీ ర్యాలీ

యాచారం: మహానగరానికి దగ్గరలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన ఫార్మాసిటీని మరోచోటకు తరలించి, ఆ ప్రాంతంలో మెగాటౌన్‌షిప్‌లు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై పలువురు ఫార్మా భూ బాధితులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన భూ బాధితులు యాచారంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఏఐసీసీ కిసాన్‌సెల్ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి కోదండరెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలు గ్రామాల ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా ఫార్మాసిటీని ఏర్పాటు చేసి ఈ ప్రాంతాన్ని కాలుష్య పరంగా సర్వనాశనం చేయాలని చూసిందని మండిపడ్డారు. అక్రమ కేసులు పెట్టి జైలుకు కూడా పంపారని అన్నారు. నేడు ఫార్మాసిటీ భూ బాధితుల ఆగ్రహానికి కేసీఆర్ సర్కార్ కొట్టుకుపోయిందన్నారు. ఫార్మాసిటీని రద్దు చేస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి, అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తున్నామని, ఆ భూముల్లో మెగా టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేస్తామని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫార్మాసిటీ వద్దని ఆందోళన చేసిన రైతులపై పెట్టిన కేసులను ఎత్తేయాలని కోరారు. అంతకు ముందు మండల కేంద్రంలో ఉన్న అంబేద్కర్, జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ వేత్త కవుల సరస్వతి, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల సర్పంచులు రమేష్, రాజశేఖర్‌రెడ్డి, నానక్‌నగర్ మాజీ సర్పంచ్ ముత్యాల వెంకటరెడ్డి, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ శ్రీకాంత్ నాయక్ పాల్గొన్నారు.

ఫార్మాసిటీ రద్దు హర్షణీయం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఎన్నికల హామీల్లో భాగంగా ఫార్మాసిటీని రద్దు చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫార్మాసిటీ రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని తెలిపారు. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూమిలో పర్యావరణహిత మెగా టౌన్‌షిప్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించడంతో ఆ ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు వెంకటేశ్ గౌడ్, చల్లా బాల్‌రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, శ్రీశైలం, యాదిరెడ్డి పాల్గొన్నారు.

మా పోరాటాల ఫలితమే

తమ పార్టీ చేపట్టిన పోరాటాలతోనే ఫార్మా సిటీ రద్దయిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల్లో ప్రజల ఇష్టాలకు వ్యతిరేకంగా అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తామని బలవంతంగా 19 వేల ఎకరాల భూమిని తీసుకుందని తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయాన్ని నమ్ముకుని జీవిస్తున్న ఈ ప్రాంతంలో విషపూరితమైన ఫార్మాసిటీ వద్దని మొదటగా 2015లో తమ పార్టీ పోరాటం చేసిందని గుర్తు చేశారు. ఈ క్రమంలో తమ నాయకులపై అక్రమ కేసులు బనాయించిందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని కేంద్రమంత్రుల దృష్టికి తీసుకెళ్లి అనుమతులు రాకుండా అడ్డుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఫార్మా సిటీ నిలిపియాలని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. తమ పార్టీ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు.

లోక్‌సభ ఎన్నికలకు సహకరించాలి

- అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి



రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి కోరారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాసన సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఎస్‌ఎస్‌ఆర్ 2024లో భాగంగా వచ్చే జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న యువతీయువకులు ఓటర్లుగా నమోదయ్యేలా కృషి చేయాలన్నారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు కోసం వచ్చే దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. జనవరి 6న డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేయడం జరుగుతుందన్నారు. తర్వాత ఏమైనా మార్పులు చేర్పులకు సంబంధించి జనవరి 22వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.వచ్చిన దరఖాస్తులను 2024 ఫిబ్రవరి 2వ తేదీ వరకు పరిశీలన పూర్తి చేసి, ఫిబ్రవరి 8న తుది జాబితాను వెలువరించాల్సి ఉంటుందన్నారు. ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించేలా చర్యలు తీసుకుంటామన్నారు. లోటుపాట్లుంటే సరిస్తామన్నారు. ఓటరు జాబితాలో పేర్లు తొలగించిన వాటి విషయంలో సమగ్రంగా ఇంటింటి సర్వే చేపట్టి పరిశీలిస్తామని, డుప్లికేషన్‌లు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, ఎక్కడైనా కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉంటే ప్రతిపా దనలు పంపిస్తామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారి సైదులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అంచలంచెలుగా..

పాల ఎల్లమ్మ కొడుకు అసెంబ్లీ స్పీకరయ్యాడు



- తెలంగాణ సభాపతిగా ప్రసాద్‌కుమార్ బాధ్యతల స్వీకరణ
- తాండూరు మండలం బెల్కటూర్ స్వగ్రామం
- ఎంపీటీసీ నుంచి రాజకీయ ప్రస్థానం

తాండూరు: తెలంగాణ స్పీకర్‌గా మాజీ మంత్రి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తాండూరు మండలం బెలకటూర్‌కు చెందిన ప్రసాద్‌కుమార్ తాండూరు పట్టణంలో స్థిర నివాసం ఏర్పర్చుకున్నారు. వ్యవసాయమే వృత్తిగా వీరి కుటుంబం జీవనం సాగించింది. తల్లి ఎల్లమ్మ పాల వ్యాపారం చేసేవారు. పట్టణంలోని కుమ్మర్‌గల్లి ప్రాంతానికి చెందిన పాల ఎల్లమ్మ అంటే తెలియని వారుండరు. ప్రసాద్‌కుమార్ తల్లికి చేదోడువాదోడుగా ఉంటూ వచ్చారు. 1982లో కాంగ్రెస్ పార్టీ నుంచి తాండూరు మున్సిపల్ కౌన్సిలర్‌గా పాల ఎల్లమ్మకు పోటీ చేసే అవకాశాన్ని నాటి మంత్రి చందుమహరాజ్ కల్పించారు. ఆ ఎన్నికల్లో ఆమె స్వల్ప తేడాతో ఓటమి చెందారు. ప్రసాద్‌కుమార్ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాభ్యాసం సాగించారు. ఆయనకు ఏడుగురు సోదరీమణులు ఉన్నారు. తండ్రి మరణంతో విద్యార్థి దశలోనే కుటుంబ బాధ్యతలు ప్రసాద్‌కుమార్‌పై పడ్డాయి. దీంతో చదువుకు స్వస్తి పలికారు. సోదరి చేయూతతో హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్ ప్రాంతంలో ఓ ప్రింటింగ్ ప్రెస్ ప్రారంభించారు.

అలా రాజకీయ ప్రస్థానం..

కొంతకాలం పాటు ప్రింటింగ్ ప్రెస్ నడిపించిన ప్రసాద్‌కుమార్ తర్వాత తల్లి రాజకీయ వారసత్వాన్ని పుణికి పుచ్చుకొన్నారు. ఎంపీటీసీ సభ్యుడిగా రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టారు. అనంతరం మర్పల్లి ఎంపీపీగా కొనసాగారు. ఈ క్రమంలో వైఎస్సార్ హయాంలో వికారాబాద్ నియోజకవర్గానికి మధ్యంతర ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను గడ్డం ప్రసాద్‌కుమార్‌కు కేటాయించారు. ఈ ఎన్నికల్లో ఆయన ఎమ్మెల్యేగా తొలిసారి విజయం సాధించారు. తర్వాత రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. కిరణ్‌కుమార్ రెడ్డి కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం శాసనసభలో స్పీకర్‌గా అవకాశం దక్కించుకున్నారు. దీంతో ఇటు తాండూరు, అటు వికారాబాద్‌లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

పలువురి శుభాకాంక్షలు

షాద్‌నగర్: అసెంబ్లీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన గడ్డం ప్రసాద్ కుమార్‌కు గురువారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

మరో టౌన్‌షిప్?

హెచ్‌ఎండీఏ చేతికి ఫార్మాసిటీ భూములు?

- పెద్ద సంఖ్యలో వెంచర్లు వెలిసే అవకాశం
- మెట్రో సిటీలు, ఐటీ అనుబంధ కంపెనీలు
- ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా హర్షాతిరేకాలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఔటర్ అవతల కొత్తగా మరో నగరం ఆవిష్కృతం కానుంది. ఇటు పల్లెలను.. అటు పట్టణాలను మిళితం చేస్తూ అత్యాధునిక టౌన్‌షిప్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఇక్కడ ప్రభుత్వ, ప్రైవేటు భూములు పెద్ద సంఖ్యలో ఉండటం కలిసి వచ్చే అంశం. ఐటీ అనుబంధ పరిశ్రమలు, హోటళ్లు, వ్యాపార సముదాయాలు, రియల్ ఎస్టేట్ సంస్థలను ఇక్కడికి తరలించడం ద్వారా ఆయా ప్రాంతాల్లోని ప్రజల జీవనశైలి కూడా పూర్తిగా మారిపోయే అవకాశం లేకపోలేదు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిన ఫార్మా సిటీని రద్దు చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి రెండు రోజుల క్రితం ప్రకటించిన విషయం విదితమే. ఫార్మాసిటీ పేరుతో ఇప్పటికే రైతుల నుంచి బలవంతంగా సేకరించిన భూములను హెచ్‌ఎండీఏ, హౌసింగ్ బోర్డులకు అప్పగించడం ద్వారా కాలుష్యకారక పరిశ్రమల భారీ నుంచి ఆయా గ్రామాల ప్రజలకు విముక్తి కల్పించడంతో పాటు హెచ్‌ఎండీఏ వేలంలో ప్రభుత్వ భూముల అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో ఆదాయాన్ని సమకూర్చవచ్చని యోచిస్తోంది.

రద్దు ప్రకటనతో సంబరాలు..

ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్న కాలుష్య కారక ఫార్మా కంపెనీలను శివారు ప్రాంతాలకు తరలించాలని అప్పటి ప్రభుత్వం భావించింది. ఈ మేరకు 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటును ప్రతిపాదించింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత భూ సేకరణ ప్రారంభించింది. యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల పరిధిలోని 10 గ్రామాల పరిధిలో మొత్తం 19,333 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు భూములను ఫార్మాకు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఇక్కడ 412 ఫార్మా కంపెనీలు, 173 బల్క్ డ్రగ్ యూనిట్లు నెలకొల్పాలని సంకల్పించింది. భూసేకరణ సమయంలో స్థానిక ప్రజల నుంచి పెద్దెత్తున్న నిరసన వ్యక్తమైంది. కొంత మంది స్వచ్ఛందంగా భూములు ఇస్తే.. మరికొంత మంది నిరాకరించారు. అసైన్డ్ భూములకు నష్ట పరిహారంగా రూ.12.5 లక్షలు, పట్టా భూములకు రూ.16 లక్షల చొప్పున మొత్తం రూ.600 కోట్ల వరకు ఖర్చు చేశారు.

నష్ట పరిహారం తీసుకునేందుకు నిరాకరించి, కోర్టును ఆశ్రయించిన వారి డబ్బులను అథారిటీలో జమ చేశారు. ఇప్పటికే 90 శాతం భూసేకరణ పూర్తైంది. మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధమైంది. దరఖాస్తు చేసుకున్న కంపెనీలకు భూకేటాయింపు ప్రక్రియ కూడా ప్రారంభమైంది. అయితే.. తాము అధికారంలోకి వస్తే..ఫార్మాసిటీని రద్దు చేస్తామని, రైతుల నుంచి బలవంతంగా లాక్కొన్న భూములను తిరిగి వారికే అప్పగిస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలకు హామీ ఇచ్చింది. ఆ మేరకు అధికారంలోకి వచ్చిన తర్వాత ఫార్మా సిటీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఫార్మాసిటీ స్థానంలో కొత్తగా అత్యాధునిక టౌన్‌షిప్‌లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కందుకూరు, యాచారం మండలాలకు చెందిన రైతులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.

మారనున్న రూపురేఖలు..

ఇప్పటికే నగరానికి పశ్చిమాన పెద్ద ఎత్తున ఐటీ అనుబంధ కంపెనీలు వచ్చి చేరాయి. భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఇక్కడ జనాభా కూడా విపరీతంగా పెరిగిపోయింది. సాధారణ, మధ్య తరగతి ప్రజలు సొంత ఇళ్లు కొనుక్కోలేని పరిస్థితి. శంషాబాద్, రాజేంద్రనగర్, గండిపేట, మొయినాబాద్, శంకర్‌పల్లి, కొత్తూరు, షాబాద్ మండలాల్లో భారీగా భూములున్నప్పటికీ.. జంట జలాశయాల పరిరక్షణ పేరుతో ఆయా ప్రాంతాల్లో నిర్మాణాలకు 111 జీఓ అడ్డంకిగా మారింది. ఈ జీఓ పరిధిలోని విలువైన భూములు కూడా ఇప్పటికే పెద్దల చేతుల్లోకి వెళ్లిపోయాయి. నగరానికి తూర్పున (శ్రీశైలం, నాగార్జున సాగర్ జాతీయ రహదారుల మధ్యలో) వేలాది ఎకరాల అనువైన ప్రభుత్వ భూములున్నాయి. పట్టా భూముల ధరలు కూడా చాలా తక్కువ. కొత్తగా వచ్చే ఐటీ అనుబంధ పరిశ్రమలతో పాటు వ్యాపార, వాణిజ్య సంస్థలు, ఇంజినీరింగ్ ఇతర వృత్తివిద్యా కోర్సులకు సంబంధించిన కాలేజీలు, విశ్వవిద్యాలయాలు, ఆస్పత్రులను ఇక్కడికి తరలించడం ద్వారా ఆయా ప్రాంతాల్లోని ప్రజల జీవనశైలిని మెరుగుపర్చడంతో పాటు గ్రేటర్‌పై ప్రస్తుతం ఉన్న రవాణా భారాన్ని కూడా తగ్గించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. హెచ్‌ఎండీఏ చేతికి ఫార్మా భూములు అప్పగిస్తే.. ఇప్పటికే ఈ ప్రాంతంలో పట్టా భూములు కొనుగోలు చేసి, వెంచర్లు ప్లాట్లు చేసిన వ్యాపారులు భూముల ధరలు తగ్గి, వ్యాపారులు నష్టపోయే ప్రమాదం లేకపోలేదు.

నలుగురి అదృశ్యం

తలకొండపల్లి: మండల పరిధిలోని రాంపూర్‌కు చెందిన సప్పిడి కుమార్ వ్యక్తిగత పనుల నిమిత్తం ఈనెల 4న హైదరాబాద్ వెళ్లాడు. 9వ తేదీన వాళ్ల సోదరుడు మహేశ్‌తో కుమార్ ఫోన్లో మాట్లాడాడు. అయితే 10వ తేదీ నుంచి కుమార్ ఫోన్ స్విచ్‌ఆఫ్ వస్తోంది. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువులు, మిత్రులు, పరిచయస్తులకు ఫోన్లు చేయడంతో పాటు పరిసర ప్రాంతాలన్నీ గాలించారు. అయినప్పటికీ కుమార్ ఆచూకీ దొరకలేదు. కుమార్ అన్న మహేశ్ గురువారం తాండూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు తాండూరు ఎస్ఐ శ్రీను తెలిపారు.

ముగ్గురి అదృశ్యం..

కందుకూరు: భార్యభర్తలు గొడవపడిన ఘటనలో భార్య, కుమారుడితో పాటు భర్త అదృశ్యమైన సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపిన వివరాలు. మండల పరిధిలోని నేదునూరుకు చెందిన భార్యభర్తలు బాబయ్య(34), మమత(32) కూలీపనులు చేసుకుని జీవిస్తున్నారు. కాగా ఈనెల 11న రాత్రి ఇంట్లో వారిద్దరు గొడవపడ్డారు. కాగా 12న ఉదయం 6 గంటల సమయంలో భార్య మమత మనస్తాపంతో తన కుమారుడు సాకేత్(9)ను తీసుకుని ఇంటినుంచి వెళ్లి వెళ్లిపోయింది. విషయం తెలుసుకుని వారిని వెతకడానికి అని మరుసటి రోజు ఉదయం వెళ్లిన బాబయ్య ఇప్పటి వరకు ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ముగ్గిరి ఆచూకీ లభించలేదు. ఈ మేరకు గురువారం కందుకూరు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సైదులు తెలిపారు.

వరదకాలువకు అడ్డుగా ఉన్న ప్రహరీ కూల్చివేత

శంషాబాద్ రూరల్: వరదకాలువకు అడ్డుగా ఏర్పాటు చేసిన ప్రహరీని రెవెన్యూ అధికారులు గురువారం కూల్చివేశారు. మండలంలో కబ్జాలకు గురవుతున్న వరదకాలువల దుస్థితిపై ఈ నెల 14న సాక్షిలో ప్రచురితమైన 'కబ్జా కోరల్లో వరదకాలువలు' అనే కథనానికి అధికారులు స్పందించారు. రామంజాపూర్ శివారులో కొందరు వరదకాలువకు అడ్డుగా నిర్మించిన ప్రహరీనిఆర్ఐ సరిత ఆదేశాలతో కూల్చివేశారు.

PUBLIC NOTICE

My Client 1.Sri.Nandigama Narasimha Das Goud S/o Late Anjaiah Goud ,aged about 46 years, Occ: Pvt.Employee, 2.Sri.Nandigama Krishna Goud S/o Late Anjaiah Goud, aged about 41 years, Occ: Pvt.Employee, both are residing at H.No.14-79, Kesaram Village, Chevella Mandal, R.R.Dist 501503 filed a suit for declaration & Injunction against the Kalemula Balaiah Goud & ors including M/s.Aparna Farms and Estates LLP, a limited liability Partnership, (being an associate & affiliate of Aparna Costeuctions and Estles Pvt.Ltd-ACEP O/o Astral Heights, #802, D.No.6-3-352/2&3, Road No.1, Banjara Hills, Hyderabad, T.S.500 034. Rep.by its authorized signatory A.Srinivas S/o. A.Chakradhara Rao, aged about 53 years, Occ:Service, O/o#, #802, D.No.6-3-352/2&3, Road No.1, Banjara Hills, Hyderabad, T.S.500 034 Vide O.S.No.478/2021 at Junior Civil Judge, Rangareddy at Chevella, the suit schedule of property i.e. in respect of the land admeasuring Ac.2-33 gts in survey No. 120 is situated at Kesaram Village, Chevella Mandal, Ranga Reddy District under Tahsildar & Jt.Subregistrar, Chevella, executed by the Defendant No. 25 to 28 to third parties from the office of theS.R.O.Chevella is null and void and inoperative in the eye of law as well as the suit is pending at the Hon'ble court at Chevella.

Hence, the general public, Financial institutions, Banks etc or hereby warned not to entertain or misuse of the said scheduled of property by third parties for any collateral/Loan purpose otherwise, and if anybody entertain the same at their own risk and peril may such transactions will not be binding on my clients and will be initiate the legal action against such persons transactions if any occurred.

Sd/- **MAHENDER NANDARI**, M.A., B.ED., LL.B.
Advocate, # 6-3-252/34/A, Ramakrishna Nagar Colony, Erram Manzil, Hyderabad -500082, T.S.
Cell: 9849669847

ఇగ్నైట్ ఫెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న శారద

మొయినాబాద్: మొయినాబాద్ మండలం తోలుకట్టలో ఉన్న చేవెళ్ల గురుకుల పాఠశాల విద్యార్థులు ఇగ్నైట్ ఫెస్ట్–2023లో అద్భుత ప్రతిబ కనబర్చారు. ఇటీవల వికారాబాద్ జిల్లాలోని శివారెడ్డిపేట గురుకులంలో ఇటీవల జరిగిన రీజినల్ లెవెల్ ఇగ్నైట్ ఫెస్ట్‌లో భాగంగా కథలు చెప్పడంలో ప్రణీత(ఇంగ్లీష్) ద్వితీయ స్థానం, నందిని(తెలుగు) ద్వితీయ స్థానం సాధించారు. పుస్తక సమీక్షలో జే.పూజ(ఇంగ్లీష్) ప్రథమ స్థానం, స్కిట్ అండ్ డ్రామాలో నిహారిక, స్పందన, వి.అమూల్య, కావేరి, వై.అమూల్య, అర్చన, కె.నందిని, రుచిత, హాసిని, ఇందరప్రియదర్శిని గ్రూప్ ప్రథమస్థానం, థిమాటిక్ డ్రాయింగ్‌లో రాజేశ్వరి మూడోస్థానం, వై.శృతి మూడోస్థానం, బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్‌లో మైత్రి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులను సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ ప్రాంతీయ సమన్వయాధికారి శారద, ప్రిన్సిపాల్ రమాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

కొత్త సొబగులు


కొనసాగుతున్న ఆదిబట్ల రోడ్డు విస్తరణ పనులు

- ఆదిబట్ల ఐటీహబ్ రహదారికి మోక్షం
- ఔటర్ నుంచి పునరుద్ధరణ పనులు షురూ
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల ఐటీహబ్ రోడ్డుకు మోక్షం లభించింది. యేండ్ల తరబడి ఈ రోడ్డును వెడల్పు చేయకపోవడంతో ఇటుగా రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం ఆరోడ్డు పనులు పూర్తికానుండటంతో ఆదిబట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు పది సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ పనులు ప్రస్తుతం చకచకా కొనసాగుతున్నాయి. ఆదిబట్ల నుంచి ఔటర్ రింగ్‌రోడ్డు వరకు ఉండే రోడ్డు సింగిల్‌గా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం ఈ ఇబ్బందులకు చెక్ పెడనుంది. టీఎస్ఐఐసీ అధికారులు ఈ రోడ్డు పనరుద్ధరణ పనులను త్వరలో పూర్తిచేయనున్నారు.

ఔటర్ వరకు రోడ్డు వేయాల్సి ఉన్నా..

టీసీఎస్ ఏర్పడినప్పటి నుంచి ఆదిబట్ల ఏరోస్పేస్ నుంచి ఆదిబట్ల మీదుగా బొంగ్లూర్ ఔటర్ రింగ్‌రోడ్డు వరకు డబుల్ రోడ్డు వేయాల్సి ఉంది. అయితే ఆదిబట్ల టౌన్ వరకు మాత్రమే వేశారు. ఆదిబట్ల టౌన్ నుంచి ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌కు కొద్దిదూరం వరకే రోడ్డు పూర్తిగా వేశారు. అక్కడ నుంచి భూ సమస్య కారణంగా రోడ్డును నిలిపివేశారు. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందే రోడ్డు కోసం రైతులు భూములు ఇచ్చినప్పటికి టీఎస్ఐఐసీ అధికారులు రోడ్డును పూర్తిచేయకుండా వదిలేశారు. ప్రస్తుతం ఆ పనులు 60శాతం వరకు పూర్తిచేశారు.

రూ.3కోట్లతో రీకార్పెటింగ్...

ఆదిబట్ల ఏరోస్పేస్ నుంచి ఔటర్ రింగ్‌రోడ్డు వరకు టీఎస్ఐఐసీ అధికారులు రోడ్డు వేస్తున్నారు. రూ.3 కోట్లు వెచ్చించి పోలీస్‌స్టేషన్ సమీపంలో మిగిలిపోయిన 300 మీటర్ల రోడ్డు వేశారు. అలాగే సెజ్ వరకు రీకార్పెటింగ్ లేయర్ వేయనున్నారు. గతంలో గుంతలమయంగా మారిన ఈ రోడ్డు గుంతలు పూడ్చివేతతో పాటు వెడల్పు చేయనుండటంతో ఐటీ హబ్‌కు కొత్త హంగులు రానున్నాయి. నిరంతరం వేలాది సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండంతో రోడ్లు దెబ్బతిన్నాయి. వారం రోజుల్లో పనులు పూర్తి చేయనున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. పనులు పూర్తి అయితే ఆదిబట్ల పట్టణ ప్రజలతో పాటు ఐటీ ఉద్యోగులకు రాకపోకలు సులభతరం కానున్నాయి.

పనులు పూర్తిచేయిస్తాం



ఆదిబట్ల ఐటీ కారిడార్ రోడ్డు పూర్తిగా ధ్వంసం అయ్యింది. ఈ రోడ్డు పనులు పూర్తిచేయాలని ఎన్నికల ముందు నుంచి టీఎస్ఐఐసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రైతులు కూడా 8 సంవత్సరాల క్రితమే భూములను ప్రభుత్వానికి అప్పగించాం. అధికారులు, అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యం వలన పనులు ముందుకు సాగలేదు. వారం రోజుల్లో పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించాను. ఐటీ కారిడార్‌కు మెరుగైన రోడ్డు వేస్తాం. దీంతో స్థానికుల, ఐటీ ఉద్యోగుల కష్టాలు తీరనున్నాయి. ఐటీ కంపెనీలకు మౌళిక సదుపాయలు కల్పిస్తాం.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

సంతోషంగా ఉంది



చాలా సంవత్సరాలుగా రోడ్డు వెడల్పు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. అధికారులకు అనేకమార్లు చెప్పినా పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పనుల విషయంలో పురోగతి రావడం శుభపరిమాణం. అధిక నిధులు కేటాయించి అభివృద్ధికి బాటలు వేస్తుంది. ఎమ్మెల్యే మల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం అభివృద్ధి చెందుతుంది. ప్రజలంతా ఎమ్మెల్యేకు సహకరించాలి. ఆదిబట్ల ఐటీలో అగ్రగామిగా నిలుస్తుంది.

– లావణ్య, కౌన్సిలర్, ఆదిబట్ల

లైంగికదాడి కేసులో..

నిందితుడికి 20 ఏళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేసి విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ రంగారెడ్డి జిల్లా పోక్సో స్పెషల్ కోర్టు న్యాయమూర్తి పద్మావతి గురువారం తీర్పు చెప్పారు. ఏపీపీ సునీత తెలిపిన వివరాలు.. సరూర్‌నగర్‌కు చెందిన నాగరాజుకు అదే ప్రాంతానికి చెందిన 9వ తరగతి విద్యార్థినితో పరిచయం ఏర్పడింది. పరిచయాన్ని అసరాగా తీసుకున్న అతను ప్రేమ, పెళ్లి పేరుతో బాలికను నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు ఈ విషయం తల్లిదండ్రులకు తెలపడంతో ఆమె తల్లి సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడంతో విచారణ చేపట్టిన న్యాయ స్థానం గురువారం నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.30వేల జరిమానాతో పాటు బాధితురాలికి రూ.10లక్షల పరిహారం ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. నిందితుడికి శిక్ష పడేందుకు కృషి చేసిన ఏపీపీ సునీత, ఎల్బీనగర్ ఏసీపీ జానకి రెడ్డిని ఘనంగా సత్కరించారు.

శ్రీశైలంలా ప్రసిద్ధి చెందుతుంది


శివాలయాన్ని పరిశీలిస్తున్న శివకుమార్, సుందర్‌రాజన్

- యాదాద్రి ఆలయ రూపశిల్పి సుందర్‌రాజన్
- శంకరపల్లి మండలం చందిప్పలోని మరకత శివాలయం సందర్శన

శంకర్‌పల్లి: మరకత శివాలయాన్ని కృష్ణ శిలతో పునః నిర్మిస్తున్నామని టీటీడీ మాజీ బోర్డు సభ్యుడు శివకుమార్, యాదాద్రి ఆలయ రూపశిల్పి సుందర్‌రాజన్ తెలిపారు. గురువారం శంకర్‌పల్లి మండలంలోని చందిప్ప గ్రామంలోని శివాలయాన్ని ఆయన సందర్శించడంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయం కొలతలు, లయ విస్తీర్ణం గురించి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. 11వ శతాబ్దంలో చాణక్యులు ప్రతిష్ఠించిన మరకత శివలింగాలు తెలుగు రాష్ట్రాల్లో అరుదుగా ఉంటాయని.. మన ప్రాంతంలో ఇలాంటి విగ్రహం ఉండటం ఎంతో అదృష్టం అన్నారు. శిల్పి సుందర్‌రాజన్ సూచనల మేరకు చందిప్ప మరకత శివాలయాన్ని పునః నిర్మాణం చేసేందుకు గ్రామస్తులతో చర్చించి ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయానికి నాలుగు మూలల విగ్రహాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. భవిష్యత్‌లో మరకత శివాలయం.. మరో శ్రీశైలంగా ప్రసిద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయల కమిటీ అధ్యక్షుడు సదానందం, సర్పంచ్ స్వప్న, ఎంపీటీసీ దయాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఆయల కమిటీ సభ్యులు దయాకర్‌రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'కొత్తకోట' స్టైలే వేరు!



సాక్షి, సిటీబ్యూరో: పోలీసు ఉన్నతాధికారులకు.. అందులోనూ ఐపీఎస్‌లకు ప్రధానంగా కొన్ని అంశాలు నచ్చవు. అవి వారికి తారసపడినప్పుడు తమదైన శైలిలో స్పందిస్తుంటారు. దీనికోసం కొన్నిసార్లు కింది స్థాయి వారి 'సేవలు' వినియోగించుకుంటారు. వీటికి సంబంధించి ఎలాంటి లిఖితపూర్వక ఆదేశాలు ఉండవు. ఆ చర్యతో ఏదైనా ఇబ్బంది కలిగితే మాత్రం 'సేవ' చేసిన వారికి వెన్నుదన్నుగా నిలిచి, వారిపై ఎలాంటి ప్రభావం లేకుండా చూసుకునే వాళ్లు పోలీసువిభాగంలో అత్యంత అరుదనే చెప్పాలి. అలాంటి వారిలో ఒకరు కొత్త కొత్వాల్ శ్రీనివాసరెడ్డి. ఆయన ఎస్పీ హోదాలో హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా పని చేస్తుండగా 2003లో జరిగిన ఓ సంఘటన దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

తల ఎగరేస్తే తాట తీస్తారు..

సర్వీసులో అడుగుపెట్టిన నాటి నుంచి ముక్కుసూటి వ్యక్తిగా పేరున్న కొత్తకోట శ్రీనివాసరెడ్డి కొన్ని అంశాలను ఏమాత్రం ఉపేక్షించరు. వాటిలో విధులు నిర్వర్తించే అధికారి ఎదుట తల ఎగరేయడం ప్రధానమైంది. ఎస్పీ హోదాలో ఆయన 2002–04 మధ్య రెండున్నరేళ్ళు ట్రాఫిక్ డీసీపీగా పని చేశారు. అదనపు డీసీపీ ఆపై స్థాయి అధికారులకు నైట్ డ్యూటీలు ఉంటాయి. ఈ డ్యూటీలో ఉన్న వారిని నైట్ సూపర్‌వైజింగ్ ఆఫీసర్స్ (ఎన్ఎస్ఓ) అంటారు. ట్రాఫిక్ డీసీపీగా ఉన్న కొత్తకోట సైతం ఈ డ్యూటీలు చేసేవారు. ఎన్ఎస్ఓగా ఓ రోజు నగరంలోని సున్నిత ప్రాంతాల్లో సంచరిస్తుండగా..

ఆసిఫ్‌నగర్ డివిజన్‌లో ఓ హోటల్ సమయం మించిపోయినా కార్యకలాపాలు సాగిస్తుండటం కంట పడింది.రాత్రి విధుల్లో ఉన్న స్థానిక ఠాణా ఎస్సైని పిలవాలని భావించారు.

గన్‌మెన్ తప్పుగా చెప్పడంతో...

ఆ హోటల్ ఏ ఠాణా పరిధిలోని వస్తుందంటూ తన గన్‌మెన్‌ను అడిగారు. అతడు పొరపాటుగా పొరుగున ఉన్న మరో ఠాణా పేరు చెప్పారు.వాకీటాకీ ద్వారా సమాచారం ఇచ్చిన కొత్తకోట సదరు ఠాణాలో రాత్రి విధులు నిర్వర్తిస్తున్న ఎస్సైని హోటల్ వద్దకు పిలిచారు. ఇలాంటి వాటిని పట్టించుకోవాలని, హోటల్ యజమానితో మాట్లాడి హోటల్ మూసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ ఎస్సై వెళ్లి హోటల్ యజమానితో మాట్లాడి మూయించేప్రయత్నం చేశారు. ఆ యజమాని ఓఎమ్మెల్యేకి సన్నిహితుడు కావడంతో విధులు నిర్వర్తిస్తున్న ఎస్సైకి దురుసుగా సమాధానం ఇచ్చారు. ఇది గమనించిన'కొత్తకోట' విషయాన్ని తీవ్రంగా పరిగణించారు. ఆ హోటల్ యజమానికి సదరు ఎస్సై ద్వారానే 'హితబోధ' చేయించారు.

నిబంధనల అమలులో నో కాంప్రమైజ్

- విర్రవీగిన వారిపై తనదైన 'పంథా' వినియోగం
- పనిచేసే కిందిస్థాయి వారికి అండగా నిలిచే నైజం

అసెంబ్లీ వరకూ వ్యవహారం..

దీంతో హోటల్ యజమాని మరుసటి రోజు విషయాన్ని తనకు సన్నిహితుడైన ఎమ్మెల్యేకు చెప్పారు. అప్పట్లో అసెంబ్లీ సమావేశాలు నడుస్తుండటంతో ఆ ఎమ్మెల్యేతో పాటు అదే పార్టీకి చెందిన మరో ఆరుగురు శాసనసభలో లేవనెత్తారు. 'హితబోధ' చేసిన ఎస్సై పేరుతో పాటు కొత్తకోట పేరునూ ప్రస్తావిస్తూ చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ విషయం కాస్త ఆలస్యంగా తెలిసిన ఎస్సై తీవ్ర ఆందోళనకు గురై శ్రీనివాసరెడ్డిని సంప్రదించారు. 'నీ డ్యూటీ నువ్వు చేశావు. ఎలాంటి ఆందోళన చెందకు నేనున్నా' అంటూ కొత్తకోట హామీ ఇచ్చారు.అసెంబ్లీ నుంచి ఈ విషయం అప్పటి పోలీసు కమిషనర్ కృష్ణారావు వద్దకు చేరింది. ఏడుగురు ఎమ్మెల్యేలు ఆయన వద్దే ఉండగా.. వెళ్లిన శ్రీనివాసరెడ్డి జరిగిన విషయం వారికి వివరించారు. సదరు ఎస్సై ఎక్కడకు రావాల్సిన పనిలేకుండా, సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరం లేకుండా సమస్యను పరిష్కరించారు. ఇలాంటి ఉదాహరణలు ఆయన వృత్తి జీవితంలో ఎన్నో ఉన్నాయని సన్నిహితులు చెబుతుంటారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించండి

- టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప


వీర్లపల్లి శంకర్‌తో టీఎస్ యూటీఎఫ్ నాయకులు

షాద్‌నగర్ రూరల్: విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప డిమాండ్ చేశారు. గురువారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్‌ను టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యారంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం వెంకటప్ప మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో సరిపడా తరగతిగదులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మరుగుదొడ్లు, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. పాఠశాలలకు కేటాయించిన విద్యుత్ మీటర్లు వాణిజ్య మీటర్లు కావడంతో.. విద్యుత్ బిల్లులు రూ.వేలల్లో వస్తున్నాయని, వాటిని కట్టలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు శాపంగా మారిన సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఉపాధ్యాయ సమస్యలపై వీర్లపల్లి శంకర్ సానుకూలంగా స్పందించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు వెంకటయ్య, శివారెడ్డి, నర్సింహులు, నాయకులు కృష్ణయ్య, సమత, శేఖర్‌గౌడ్, కృష్ణ, బాలయ్య, చంద్రశేఖర్, సత్యం, ప్రేమ్‌సాగర్, సురేందర్, రాములు, జ్ఞానేశ్వర్, రమేష్, రాజ్‌కుమార్, రంగరాజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి లోక్‌అదాలత్

కేశంపేట: షాద్‌నగర్ కోర్టులో శుక్రవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ వరప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో చిన్నచిన్న తగాదాలతో కేసులకు గురైన ఇరుపక్షాల వారు రాజీమార్గంలో కేసులను లోక్‌అదాలత్ ద్వారా పరిష్కారించుకోవాలని ఆయన సూచించారు. కేసుల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎస్ఐ కోరారు.

మాది విడదీయలేని స్నేహం

- ఎమ్మెల్యే కాలె యాదయ్య
- అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై ప్రశంసలు


అసెంబ్లీలో మాట్లాడుతున్న కాలె యాదయ్య

చేవెళ్ల: అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికైన గడ్డం ప్రసాద్‌కుమార్‌తో తనకున్న అనుబంధాన్ని శాసనసభలో ఎమ్మెల్యే కాలె యాదయ్య పంచుకున్నారు. 3వ శాసనసభ స్పీకర్‌గా ఎన్నికైన గడ్డం ప్రసాద్‌కుమార్‌ను గురువారం ఎమ్మెల్యే యాదయ్య కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం యాదయ్య మాట్లాడుతూ.. ఒకే జిల్లాకు చెందిన తాము రాజకీయ జీవితం ప్రారంభం నుంచి మంచి స్నేహితులమని తెలిపారు. 'మాదివిడదీయలేని స్నేహం' అన్నారు. ఒకేసారి ఇద్దరం ఎంపీటీసీలుగాఎన్నికయ్యాం. ఎంపీపీలుగా కూడా ఇద్దరం పనిచేశాం. వికారాబాద్ అసెంబ్లీ టికెట్ కోసం 4సార్లు ఇద్దరం పోటీపడ్డాం. అప్పుడు వైఎస్సార్ సర్దిచెప్పి ప్రసాద్‌కుమార్‌కే టికెట్ ఇచ్చారు. ఎమ్మెల్యేగా మొదటిసారి నామినేషన్ వేయటానికి నా బైక్‌పైనే ఎక్కించుకొని వెళ్లి నామినేషన్ వేశాం. మా ఇద్దరి మధ్య ప్రత్యేకమైన స్నేహ, సోదరబంధం ఉంది. ప్రసాద్‌కుమార్ కింది స్థాయి నుంచి అత్యున్నత స్పీకర్ పదవి వరకు ఎదిగారు. సభను సమర్థవంతంగా నిర్వహించి మంచిపేరు తెచ్చుకోవాలని కోరుకుంటున్నాను అని కాలె యాదయ్య ఆకాంక్షించారు.

కులగణన నిర్వహించాలి

- తెలంగాణ యువజన సంఘాల ఐక్యవేదిక


కులగణన చేయాలంటూ నినదిస్తున్న నాయకులు

కడ్తాల్: జాతీయ స్థాయి జనగణనతో పాటు కులగణన కూడా నిర్వహించాలని తెలంగాణ యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్ డిమాండ్ చేశారు. గురువారం ఢిల్లీలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు హనుమంత్‌రావు, మాజీ ఎంపీ కనిమోళి, వివిధ బీసీ సంఘాల, వివిధ పార్టీల బీసీ నాయకుల, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి జనగణనలో కులగణన ఉద్యమానికి రాఘవేందర్ మద్దతు పలికారు. ఆయన మాట్లాడుతూ.. చట్టసభల్లో, స్థానిక సంస్థల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.

రూ.కోటి విలువైన గంజాయి పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: ఏజెన్సీ ప్రాంతాల నుంచి ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీరట్‌కు అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితులను రాచకొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.కోటి విలువ చేసే 360 కిలోల గంజాయితో పాటు కారు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఎల్బీనగర్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ) డీసీపీ కే మురళీధర్‌తో కలిసి రాచకొండ కమిషనర్ జీ సుధీర్ బాబు గురువారం వివరాలు వెల్లడించారు. యూపీకి చెందిన వికాస్ త్యాగీ, అక్బర్, ఎండీ అమీరుద్దీన్ స్నేహితులు. వీరికి యూపీలోని ఘజియాబాద్‌కు చెందిన ఓ గంజాయి పెడ్లర్‌తో పరిచయం ఏర్పడింది. ఏజెన్సీ ప్రాంతం నుంచి యూపీకి గంజాయిని సరఫరా చేస్తే కమీషన్ ఇస్తానని పెడ్లర్ ఆశ చూపించాడు. దీంతో ముగ్గురు కలిసి మహీంద్రా ఎక్స్‌యూవీ కారులో రాజమండ్రికి వెళ్లారు. అక్కడ గంజాయి విక్రయదారుడి నుంచి 360 కిలోల సరుకు కొనుగోలు చేసి ఒక్కో ప్యాకెట్ 5 కిలోల చొప్పున ప్యాకింగ్ చేసి వాహనంలో భద్రపరిచారు. హైదరాబాద్ మీదుగా యూపీకి తిరుగు ప్రయాణమయ్యారు. దీనిపై సమాచారం అందడంతో ఎల్బీనగర్ ఎస్ఓటీ, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు అబ్దుల్లాపూర్‌మెట్ ఔటర్ రింగ్ రోడ్‌లోని సంపూర్ణ హోటల్ వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

ఫాస్ట్ ట్యాగ్ మార్చి..

చెక్‌పోస్టులు, టోల్‌గేట్ల వద్ద పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకునేందుకు నిందితులు కొత్త ఎత్తుగడ వేస్తున్నారు. టోల్‌ప్లాజా వద్దకు చేరుకునే ముందు నిందితులలో ఒకరు వాహనం దిగి.. టోల్ వద్ద పోలీసుల తనిఖీలు ఉన్నాయా లేవా అని నిర్ధారించుకున్న తర్వాత వాహనంలోని వ్యక్తులకు సమాచారం ఇస్తారు. టోల్‌ప్లాజాలో వాహనం నంబరు రికార్డు కాకుండా ఇతర వాహనం ఫాస్ట్ ట్యాగ్‌ను వినియోగిస్తున్నారు. ఇదే తరహాలో గతంలో మూడుసార్లు యూపీకి గంజాయిని తరలించినట్లు ప్రాథమిక విచారణలో నిందితులు వెల్లడించారు.